క్లుప్తంగా

జాతీయ జూడో పోటీలకు నసనకోట విద్యార్థిని



జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన తేజశ్విని

రామగిరి: మండలంలోని నసనకోట జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని తేజశ్విని జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ చామంతి గురువారం తెలిపారు. రెండు నెలల్లో స్కూల్ గేమ్స్ తరఫున రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో తేజశ్విని బంగారు పతకం సాధించిందని, ఈనెల 6 నుండి 11 వరకు పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటన

ముదిగుబ్బ: మండల పరిధిలోని నాగారెడ్డిపల్లి, ఓకే తండా, ఎనుములవారిపల్లి, మలకవేముల, మలకవేముల క్రాస్ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలపై నిఘా



బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బత్తలపల్లి: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు పరిశీలించారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి, మాల్యవంతం, బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ పి.శ్రీనివాసులతో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, ఫ్యాక్షన్ నేతలకు, ఇతరత్రా కేసుల్లోని నిందితులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన కృష్ణయ్య అనే వ్యక్తి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మారాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అతడికి సభ్యత్వం ఉండటంతో రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం మృతుడి భార్య రాధమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, కొత్తకోట ప్రెసిడెంట్ కేశవయ్య, సీఈఓ ప్రతాప్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

రామగిరి: విద్యార్థులకు సమాజంపై పూర్తి అవగాహన అవసరమని సీఐ చిన్నగౌస్ తెలిపారు. గురువారం రామగిరిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజ్‌లో డిగ్రీ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినుల కోసం ప్రభుత్వం 'దిశ' యాప్‌ను తీసుకొచ్చిందని, ఏమైనా ఇబ్బందులున్నా విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన్ నాయుడు , పోలీస్ సిబ్బంది, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. పలువురు దంపతులతో అనఘాష్టమి వ్రతాన్ని అర్చకులు చేయించారు.

జగన్ చెప్పారంటే.. చేస్తారంతే



ఓడీచెరువులో పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ఓడీచెరువులో కార్యక్రమానికి హాజరైన పింఛన్‌దారులు



తనకల్లు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

- హామీ మేరకు పింఛన్లను రూ.3 వేలకు పెంచారు
- వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలి
- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

అమడగూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక చౌడేశ్వరీ కల్యాణ మండపంలో పింఛన్ పంపిణీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్మును రూ.3 వేల చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పింఛన్ మొత్తాన్ని పెంచి రూ.3 వేలు ఇస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాయమాటలు చెప్పి మిమ్మల్ని తప్పుదోవ పట్టించడానికి మాయల పకీర్లు వస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్‌బాబు, కల్యాణ్‌బాబు, పల్లె బాబు ఈ నలుగురిని నమ్మొద్దని సూచించారు. పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే 18 వేల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. బిల్లుల మంజూరు కాస్త జాప్యమవుతున్నా ఎన్నికల కోడ్ లోపే లబ్ధిదారులందరికీ బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో మీ అందరి సహకారంతో పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారోమారు సీఎం కావడానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, రాష్ట్ర బలిజ/భట్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూదన్ రాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శి భారతిరెడ్డి, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి పాల్గొన్నారు.

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. డ్వాక్రా రుణాల మాఫీ, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం ఇలా పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబును అన్యాయంగా జైల్లో పెట్టించారని గగ్గోలు పెట్టిన నారా భువనేశ్వరమ్మ తన తండ్రి చావుకు కారణం ఎవ్వరో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, పార్టీ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు బీఆర్ కేశప్ప, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు కే. రవిచంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, మార్కెట్ యార్డు చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, మండల మహిళా కన్వీనర్ చిన్నాదేవి, నాయకులు అశ్వర్థనారాయణ, నాగరాజునాయుడు, కమలాకర్‌నాయుడు మాట్లాడారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, సర్పంచ్‌లు ప్రమీలమ్మ, ప్రసాద్, కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, మాజీ సర్పంచ్‌లు రాంమోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలాజీనాయుడు, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్ర నాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

తనకల్లు: పార్టీలు, కులమతాలకు అతీతంగా ఇంటి వద్దకే ఫించన్ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పెంచిన రూ.3 వేల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో రూ.3 వేల పింఛన్ అందజేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. గత ప్రభుత్వం హయాంలో పింఛన్ల కోసం గంటల కొద్దీ పడిగాపుల కాసేవారని తెలిపారు. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే వలంటీర్లతో అవ్వాతాతలకు ఇంటి వద్దకే పింఛన్ అందజేస్తున్నారని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి నెలా 8 వేలకు పైగా ఫించన్లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల వారికి మంచి చేసిన జగనన్నను గుర్తు పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ డబ్బు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకుడు బీఎస్ తబ్రేజ్, నాయకులు శ్రీనివాసులు నాయుడు, దేశాయి సంజీవరెడ్డి, నీలకంఠారెడ్డి, కొండా మల్లికార్జున, రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, నిజాం, బాల్‌రెడ్డి, సమరసింహారెడ్డి, చిన్నపరెడ్డి, శ్రీనివాసులు, చిదానందరెడ్డి, సిద్దారెడ్డి, హేమశేఖర్ రెడ్డి, రామమోహన్‌రెడ్డి, గంగప్ప నాయుడు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

తాడిమర్రి: రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేసిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్ము అందజేశారు. గత టీడీపీ హయాంలో మండలంలో 2,200 పింఛన్లు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్ సీఎం కాగానే మండలంలో 6,155 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పింఛన్‌దారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, సచివాలయ మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజేంద్ర, మాజీ సర్పంచ్ పాటిల్ ప్రకాష్ రెడ్డి, నాయకులు మురళీమోహన్‌రెడ్డి, సర్పంచులు వెంకట నారాయణరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని 33వ వార్డులో వినూత్నంగా పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ బడన్నపల్లి కేశవరెడ్డి తొలుత వార్డులోని పింఛనుదారులకు భోజన వసతి కల్పించారు. అనంతరం వారికి పెంచిన రూ.3 వేల పింఛన్ సొమ్ము అందజేశారు.

తలుపుల: మండలంలోని వీరప్పగారిపల్లి, కుర్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి కుర్లి శివారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట రమణారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

అవ్వాతాతల మోములో చిరునవ్వులు..

ఓడీచెరువు: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి.. అవ్వాతాతల మోములో చిరునవ్వులు కురిపించారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసి, మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ ఇచ్చే హామీలను నమ్మొద్దని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ కరోనా కష్టకాలంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, మైనారిటీ కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, టౌన్ కన్వీనర్ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద రెడ్డి, సొసైటీ ప్రెసిడెంటు రామసుబ్బారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



తాడిమర్రి మండలం పెద్దకోట్లలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి



ధర్మవరం: పింఛన్ అందిస్తున్న కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ బడన్నపల్లి కేశవరెడ్డి

సంక్షేమ సారథి వైఎస్ జగన్



పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండెల్లో సుస్థిర స్థానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపాదించుకున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రంగాపురం, ఈదులపల్లి, ఎస్.బండ్లపల్లి, మర్తాడు, దామానుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ఫించన్ డబ్బు రూ.3 వేలకు మీ కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు.. సంతోషమే కదా అవ్వా అంటూ పలువురు వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం అవుతున్నట్లు వెల్లడించారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా మార్చారన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు దోచుకు తిన్నారని మండిపడ్డారు. ప్రతి పనికీ లంచం తీసుకునే వారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు టీడీపీ సానుభూతి పరులకే అందించారన్నారు. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. అంతకుముందు గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సీవి నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, శివారెడ్డి, ఎంపీటీసీలు భవాని, మధుసూధనదేవి, నాయకులు కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంగళరెడ్డి, జ్యోతిరెడ్డి, వాసుదేవరెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివ, వెంకటేష్, రామిరెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు. .

ఆర్థికసాయం అందజేత..

ముదిగుబ్బ: మండల కేంద్రానికి చెందిన మన్సూర్ అలీఖాన్ అనారోగ్య సమస్యలతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మృతుడి తల్లిదండ్రులు డిప్పరు, షాహిదాను పరామర్శించారు. అనంతరం వారికి రూ.50 వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, భాస్కర్, కిరణ్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో శుక్రవారం నూతనంగా నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ గురువారం తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఇస్తెమాకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు

గాండ్లపెంట: మండల కేంద్రంలో ఈనెల 2,3 తేదీల్లో జరిగిన ఇస్తెమాకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి, అన్ని శాఖల అధికారులకు జమాత్ సభ్యులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

తలుపుల: స్థానిక కుమ్మరపేట సమీపంలో మద్యం విక్రయిస్తున్న మూడే బాబులమ్మను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మగ్బుల్ బాషా తెలిపారు. నిందితురాలి ఇంటి వద్ద 8 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం

తలుపుల: పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతూ, కార్యకర్తలకు అండగా ఉంటామని కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు, కన్వీనర్ పయాజ్ అహమ్మద్ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మక్బూల్కు పూలమాలలు వేసి, బొకేలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. మసీదు బజార్, పూలబాజార్, ఉబ్బరవాండ్లపల్లి, నంగివాండ్లపల్లి, ఓబీఆర్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా మక్బూల్ అహమ్మద్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనకు సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిందన్నారు. అందరి సమన్వయంతో కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అంతకుముందు స్థానిక మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



వైఎస్సార్‌సీపీ శ్రేణులను కలిసిన సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్

జగన్‌ను సీఎంగా గెలిపించుకుందాం

ధర్మవరం అర్బన్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని 35వ వార్డులో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు పథకాలు అందాలనే లక్ష్యంతో నవరత్నాలు పథకాలను ప్రతి ఇంటికి అందించారన్నారు. ఇళ్లులేని నిరుపేదలు ఉండకూడదనే జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేశారని తెలిపారు. జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని వివరించారు. వార్డులో చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ఇంటింటా తిరుగుతూ ప్రజలకు జగన్ పాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, కౌన్సిలర్లు మారుతిప్రసాద్, భాగ్యలక్ష్మి, చింతా ఎల్లయ్య, కేతా లోకేష్, చేనేత నాయకులు కాచర్ల అంజి, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి

ఘనంగా ఎఫ్‌పీఓ వార్షికోత్సవం

నల్లమాడ: స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (ఎఫ్‌పీఓ) 7వ వార్షికోత్సవ మహాసభను అధ్యక్షురాలు ఇ.జయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ ఏపీఎం చిన్న వెంకటప్ప మాట్లాడుతూ.. గ్రామ రైతు సంఘాల పనితీరు, రుణాల రికవరీ, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం తదితర అంశాలను వివరించారు. ఎఫ్‌పీఓకు రెండేళ్ల పాటు కోశాధికారిగా పని చేసిన గంగులయ్యను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి రామప్ప, లైవ్ స్టాక్ ఏపీఎం పద్మావతమ్మ, సీసీ ఈశ్వరయ్య, రైతుమిత్రలు జయచంద్ర, కేశవ, కుళ్లాయప్ప, అకౌంటెంట్స్ ఓబుళమ్మ, శిరీష, గ్రామ సంఘాల లీడర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం చిన్న వెంకటప్ప

'కాంగ్రెస్ పార్టీ హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తా'



మాట్లాడుతున్న లయన్ పి.ఖాసీంఖాన్

కదిరి: వచ్చే ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ తరఫున హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు లయన్ పి.ఖాసీంఖాన్ ప్రకటించారు. ఎంపీ టికెట్ తనకే ఇస్తామని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఇప్పటికే ప్రకటించారని తెలియజేశారు. మరికొందరు కూడా ఇలాగే చెబుతున్నారని ఓ విలేకరి ఆయనను ప్రశ్నించగా.. తాను 2009లో స్వల్ప ఓట్లతో ఓడిపోయానని, అందుకే ఈసారి మళ్లీ అధిష్టానం తనకే టికెట్ ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దేశ వ్యాప్తంగా భవిష్యత్ ఉందని, ఏపీలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ఇప్పటికిప్పుడు బలపడాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇక్కడ కాంగ్రెస్ పుంజుకోవాలంటే 2029 వరకూ వేచి చూడకతప్పదన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న భారతీయ జనతా పార్టీని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తామంటూ ఇటీవల తెలంగాణాలో బీజేపీ నేతలు చెప్పినట్లు గుర్తు చేశారు.

మత్తుకు దూరంగా ఉండాలి

బత్తలపల్లి: మత్తు, డ్రగ్స్ పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదువుకుని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఈవ్ టీజింగ్, ఉన్నత విలువలు, మహిళలపై హత్యాచారాలు తదితర అంశాలపై వివరించారు.

మహిళపై దాడి

తలుపుల: మండలంలోని ఎగువ బైగారిపల్లికి చెందిన చెంద్రారెడ్డి భార్య రమణమ్మతో గురువారం లక్ష్మీపతిరెడ్డి, అతడి తల్లి మాలతి రస్తా విషయంలో గొడవ పడ్డారు. లక్ష్మీపతిరెడ్డి కొడవలితో రమణమ్మపై దాడి చేయండతో గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మగ్బుల్ బాషా తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

బత్తలపల్లి: పంచాయతీల్లోని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎంపీడీఓ సాయిమనోహర్ సమీక్ష నిర్వహించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ దివాకర్, మండల ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం ఫేజ్-1లో విడుదలైన నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఫేజ్-2 కింద చాలా తక్కువ మండలాలకు నిధులు విడుదల అవుతున్నాయన్నారు. అందులో మన మండలానికి నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. ఆయా పంచాయతీలకు విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పెరిగిన పింఛన్ డబ్బును ఆయా పంచాయతీల్లో వారోత్సవాలను నిర్వహించి లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు

బత్తలపల్లి: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి చేపడుతున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి మార్చి నెల 15వ తేదీ వరకూ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ఎంపీడీఓ సాయిమనోహర్, సీఎస్‌డీటీ శారద, వైద్యాధికారి గంగిరెడ్డి టీం లీడర్లుగా ఉంటారన్నారు. 5వ తేదీ సంజీవపురం, 12న మాల్యవంతం, 19న బత్తలపల్లి-2, 27న పోట్లమర్రి, ఫిబ్రవరి 2న దంపెట్ల, 9న డి.చెర్లోపల్లి, 16న ఓబుళాపురం, 23న అప్రాచెరువు, మార్చి 1వ తేదీన తంబాపురం, 15న ఈదుల ముష్టూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో క్యాంపులు ఉంటాయన్నారు.

నేడు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

కదిరి అర్బన్: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసి 75 ఏళ్లు దాటిన సీనియర్ ఉద్యోగులను శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో సన్మానిస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్ హాజరు అవుతారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.